గోవిందరావుపేటవాసికి అంతుచిక్కని చర్మవ్యాధి

ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

నిస్సహాయ స్థితిలో ఉన్న మహేశ్

గోవిందరావుపేట, మే 19: మండలానికి చెందిన బొజ్జ మహేశ్ ఎనిమిది నెలలుగా అంతుచిక్కని చర్మవ్యాధితో బాధపడుతూ ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నాడు. వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్న మహేశ్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. అనుకోకుండా చర్మ వ్యాధి బారిన పడి మంచానికి పరిమితమయ్యాడు. నాలుగు నెలలుగా హైదరాబాద్ గాంధీ దవాఖానలో చికిత్స పొందినప్పటికీ తగ్గకపోవడంతో ప్రస్తుతం ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్నాడు. ప్రైవేట్ దవాఖానల్లో చూపించాలంటే ఆర్థిక స్థోమత లేక దిక్కుతోచని స్థితిలో దాతలు ఆపన్నహస్తం అందించాలని కోరుతున్నాడు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అతడి తల్లి కుమారుడి వైద్యం కోసం ప్రభుత్వం ద్వారా సాయం అందించాలని కోరుతూ అదనపు కలెక్టర్ సంపత్‌రావుకు వినతిపత్రం అందించింది. దాతలు ముందుకు వచ్చి వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం చేయాలని కుటుంబ సభ్యులు వేడుకున్నారు. సాయం చేసేవారు పస్రా కెనరా బ్యాంకు అకౌంటర్ నంబర్ 6774101001909, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ సీఎన్ఆర్‌బీ 0001923కు కానీ, మహేశ్ సెల్ నంబర్ 91214 08124కు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా పంపాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

దేవరాంపల్లిలో చైన్‌స్నాచింగ్

కాటారం, మే 19: మండలంలోని దేవరాంపల్లిలో ఓ వృద్ధురాలి మెడలోని బంగారు ఆభరణాలు అపహరించిన ఘటన సోమవారం జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కామిడి లక్ష్మీ భర్తతో ఇంట్లో ఉంది. ఈ క్రమంలో తెల్లవారుజామున పథకం ప్రకారం ఇంటికి విద్యుత్ సరఫరాను గుర్తుతెలియని వ్యక్తి నిలిపివేశాడు. దీంతో లక్ష్మీ బయటకు రాగా ఆమె మెడలోని సుమారు రూ.2లక్షలు విలువైన రెండున్నర తులాల పుస్తెల తాడును లాక్కొని పరారయ్యాడు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న పూసూరు గ్రామ రైతులు

ఆగం చేసిన ఆడ్వంటా

- సరైన దిగుబడి రాని వరి వంగడం
- న్యాయం చేయాలని రైతుల వేడుకోలు
- ఎంపీడీఓ, తహసీల్దార్, కలెక్టర్ ఆఫీసుల్లో వినతులు

వాజేడు, మే 19 : ఆడ్వంటా (ఆడ – మగ) వరి సాగుతో సరైన దిగుబడి రాక నష్టపోయామని, ఆర్గనైజర్ ఇన్సూరెన్స్ పరిహారం చెల్లిస్తామని చెప్పి ఫోన్ చేస్తే స్పందించడంలేదని బాధిత రైతులు వాపోయారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ శ్రీరాముల శ్రీనివాస్, ఎంపీడీవో విజయ, కలెక్టర్ ఆఫీసులో సూపరింటెండెంట్ అల్లం రాజ్‌కుమార్‌కు వినతిపత్రాలు అందజేశారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పూసూరుకు చెందిన రైతుల వద్దకు మంగపేట మండలం తిమ్మంపేటకు చెందిన ఆర్గనైజర్ చిలకమర్రి వేణు వచ్చి 18 మంది 82 ఎకరాల్లో ఆడ్వంటా వరిబాండ్ సాగు చేయించాడని, ఎకరానికి పెట్టుబడి రూ.42వేలు తామే పెడతామని చెప్పడంతోపాటు ఎకరానికి దిగుబడి 8క్వింటాల్ వస్తుందని, క్వింటాల్‌కు రూ.9వేలకు కొనుగోలు చేస్తామని నమ్మబలికాడని తెలిపారు. తక్కువ దిగుబడి వస్తే ఎకరానికి రూ.60వేల ఇన్సూరెన్స్ ఇప్పిస్తామని కూడా చెప్పడంతో సాగుచేసిన తమకు పూర్తిగా పెట్టుబడి పెట్టకపోగా దిగుబడి ఎకరానికి రెండు క్వింటాళ్లు కూడా రాలేదని తెలిపారు. ఇన్సూరెన్స్ డబ్బులు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా, ధాన్యం తీసుకొని వెళ్లి 25రోజులు అవుతున్నా ఫోన్ ఎత్తడంలేదని, సదరు ఆర్గనైజర్‌పై చర్యలు తీసుకొని, పంట నష్ట పరిహారం ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. రైతులు నల్లబోయిన దేవి, పాపారావు, బతకయ్య, లింగయ్య, బడె షణ్ముఖరావు, తోలెం ప్రసాద్, జెజ్జరి సాయిబాబు, వాసం పెంటయ్య, దబ్బగట్ల లక్ష్మయ్య, యాలం అశోక్, తోలెం సమ్మయ్య, సమ్మాదేవి పాల్గొన్నారు.

శివాలయానికి సపోర్ట్‌గా ఐరన్‌పోల్స్

శిథిలావస్థలో ఉన్న రామప్ప ఉపాలయానికి కేంద్ర పురావస్తుశాఖ ఏర్పాట్లు

వెంకటాపూర్, మే 19 : మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప ఆలయ పార్కింగ్ ఏరియాలో ఉన్న శివాలయానికి కేంద్ర పురావస్తు శాఖ అధికారులు ఐరన్ పోల్స్ (స్కాప్ హోల్డింగ్)తో సపోర్ట్ ఏర్పాటు చేశారు. రామప్ప ఉపాలయమైన శివాలయం శిథిలావస్థలో ఉండగా రానున్న వర్షాకాలంలో వానలకు మరింత కూలిపోయే ప్రమాదం ఉండవచ్చని ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా ఐరన్‌పోల్స్‌ను ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు.



శివాలయానికి పోల్స్‌తో సపోర్ట్ ఏర్పాటు చేసిన అధికారులు

గాలిదుమారం.. అకాల వర్షం

వాజేడు/ వెంకటాపురం(నూగూరు), మే 19 : మండలంలోని పలు గ్రామాల్లో గాలిదుమారం సృష్టించింది. ప్రగళ్లపల్లి, ఆర్‌గుంటపల్లి, అరుణాచలపురం, కొప్పుసూరు, మొరుమురు, మొరుమురు కాలనీ గ్రామాల్లో సోమవారం సాయంత్రం బలమైన గాలులు వీచాయి. దీంతో కొన్నిచోట్ల మామిడికాయలు రాలిపోయాయి. మూడురోజులుగా గాలిదుమారంతోపాటు అకాల వర్షం కురుస్తోంది. దీంతో చల్లబడగా ఎండ వేడిమి నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. కాగా, వెంకటాపురం(నూగూరు) మండలం బెస్తగూడెం గ్రామ సమీపంలో ఆర్‌అండ్‌బీ రహదారిపై భారీ వృక్షం కూలి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బలమైన గాలి వీచడంతో టేకు చెట్లు కూలి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. అటవీ శాఖ అధికారులు తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.

పుట్ట మధుపై కాంగ్రెస్ నాయకుల విమర్శలు సిగ్గుచేటు

బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్

కాటారం, మే 19: ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుంటే చూస్తూ ఊరుకోలేక ప్రశ్నించిన బీఆర్ఎస్ నేత పుట్ట మధుపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ కాటారం మండల యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి చెందిన దళిత ఎంపీకి జరిగిన అవమానంపై ప్రశ్నించాలంటే అదే పార్టీలో ఉండాల్సిన అవసరం లేదని, ప్రతి పౌరుడు ప్రశ్నించవచ్చన్నారు. ప్రజాస్వామ్యంలో ఎంపీగా గెలిచిన వ్యక్తికి నియోజకవర్గంలో ప్రోటోకాల్ పాటించకుండా అవమానాలకు గురి చేస్తుంటే దళిత ప్రజాప్రతినిధికి ఎందుకు ప్రొటోకాల్ ఇవ్వడం లేదని అడిగే స్వేచ్ఛ లేదా? అని ప్రశ్నించారు. తమ పార్టీ ఎంపీ గురించి మీకెందుకనడం అవివేకమన్నారు. మంథని నియోజకవర్గంలో భారత రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తుంటే బీఆర్ఎస్ పార్టీ పక్షాన దళిత ఎంపీకి మద్దతుగా మాట్లాడితే హర్షించాల్సింది పోయి ఎదురు విమర్శలు చేయడం బాధాకరమన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

భూపాలపల్లి రూరల్, మే 19: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకన్న సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మే 22 నుంచి 27వ తేదీ వరకు జిల్లాలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 928 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 391 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు.

ధాన్యం డబ్బులు చెల్లింపు

ములుగు రూరల్, మే 19: యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లలో ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ మహేందర్ జీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 6,599 మంది రైతుల నుంచి 47,449 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.61.48కోట్లను 3,444 మంది రైతులకు చెల్లించినట్లు తెలిపారు. మిగతా రైతులకు సైతం త్వరలో కొనుగోలు డబ్బులు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. గత సంవత్సరంతో పోల్చితే ప్రస్తుత సీజన్‌లో చెల్లింపులను వేగవంతం చేసినట్లు వివరించారు.

నేటి నుంచి ఉపాధ్యాయుల శిక్షణ

గోవిందరావుపేట, మే 19: పాఠశాల విద్యాశాఖ తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఉపాధ్యాయులకు రెండో దశ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని సోమవారం తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించే శిక్షణ తరగతులకు ఉపాధ్యాయులు విధిగా హాజరు కావాలన్నారు. శిక్షణ అనంతరం జూన్ 6వ తేదీ నుంచి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఈఓ పేర్కొన్నారు.

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు సమకూర్చిన రూ.10వేలను అందజేస్తున్న పార్టీ నాయకులు

దహన సంస్కారాలకు ఆర్థికసాయం

ఏటూరునాగారం, మే 19: మండల కేంద్రానికి చెందిన బాస రాములు సోమవారం అనారోగ్యంతో మృతిచెందగా దహన సంస్కారాలకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు రూ.10వేల ఆర్థికసాయం సమకూర్చారు. ఈ డబ్బును స్థానిక బీఆర్ఎస్ నాయకులు మృతుడి కుటుంబానికి అందజేశారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, ఎండీ ఖాజాపాషా, తాడూరి రఘు, బాస పుల్లయ్య, ఆత్మ మాజీ చైర్మన్ దుర్గం రమణయ్య, కుమ్మరి చంద్రబాబు, జాడి భోజారావు, గండేపెల్లి నర్సయ్య, కాళ్ల రామకృష్ణ, పర్వతాల ఎల్లయ్య, బాసాని శేఖర్, దేపాక శ్రీరామ్, కటుకూరి రాఖీ, దాసరి సమ్మయ్య పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

వినతులు స్వీకరిస్తున్న పీవో చిత్రామిశ్రా

ఏటూరునాగారం, మే 19: ఐటీడీఏ పరిధిలో మండలాలకు చెందిన గిరిజనులు సమస్యలపై చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని పీవో చిత్రామిశ్రా అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనులు సమస్యలపై దరఖాస్తులు సమర్పించగా ఆమె స్వీకరించారు. వెంకటాపురం ఆస్పత్రిలో స్వీపర్ పోస్టు ఇప్పించాలని, ఆర్టీసీ డిపో స్థలం ఎదురుగా ఉన్న రెండు గదులను హోటల్ కోసం కేటాయించాలని, మహబూబాబాద్ జిల్లాలో చేపట్టిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని, ఏటూరునాగారంలో జూట్‌బ్యాగుల మిషన్, రా మెటీరియల్ సెంటర్ కోసం గది కేటాయించాలని, జగ్గన్నపేట బాలికల ఆశ్రమ కళాశాలలో పీఈటీ ఉద్యోగం ఇప్పించాలని ఆయా గ్రామాలకు చెందిన వారు దరఖాస్తులు చేశారు. వివిధ ఉద్యోగాలకు చెందిన సమస్యలపై పలువురు దరఖాస్తులు సమర్పించారు. ఏవో రాజ్‌కుమార్, డీడీ పోచం, కార్యాలయ మేనేజర్ శ్రీనివాస్, ఐటీఐ ప్రిన్సిపాల్ జగన్ మోహన్‌రెడ్డి, విద్యుత్ ఏఈ ప్రభాకర్ పాల్గొన్నారు.

సీసీ చేసిన శాశ్వత కల్లాలు ఏర్పాటు చేయాలి

గణపురం, మే 19: ధాన్యం కొనుగోలు కేంద్రాల కోసం సీసీ చేసిన శాశ్వత కల్లాలు నిర్మించాలని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కండె రవి, డీఎస్పీ మండల అధ్యక్షుడు కుర్రి స్వామినాథన్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ శాశ్వతమైన సిమెంట్ కల్లాలు లేక అకాల వర్షాలకు వడ్లు తడిసి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అలాగే ప్రతి వడ్ల బస్తాను 40 కేజీల 600 గ్రాములు మాత్రమే కాంటా పెట్టాలని కల్లాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే చెప్పారని, కానీ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు బస్తాకు 2 నుంచి 3 కిలోల వడ్లు కటింగ్ చేస్తున్నారని తెలిపారు. మిల్లర్లు, పాలకులు చేసే మోసం వల్ల ఎకరం పంట వేసిన రైతులు రూ.4,500 వరకు నష్టపోతున్నారని పేర్కొన్నారు. ప్రజాపాలన అంటే ప్రజలను దోపిడీ చేయడమా? అని ప్రశ్నించారు. అకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.

బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌కు దరఖాస్తు చేసుకోవాలి

ములుగు రూరల్, మే 19: బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద ప్రవేశాలు పొందేందుకు అర్హులైన విద్యార్థులు ఈనెల 29వ తేదీలోగా జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి లక్ష్మణ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ స్కీమ్‌కు ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు చదివే విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9441001732ను సంప్రదించాలని సూచించారు.

నేడు మెడికల్ క్యాంప్

మల్హర్, మే 19: కరీంనగర్‌లోని మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు ఇవ్వనున్నట్లు తాడిచర్ల – కాపురం గ్రామాల జెన్‌కో నిర్వాసితుల హక్కుల సాధన పోరాట కమిటీ అధ్యక్షుడు కేసరపు రవి తెలిపారు. ఏడేళ్లుగా బొగ్గు వెలికితీత కోసం చేస్తున్న బ్లాస్టింగ్ వల్ల కాలుష్యమైన గాలి పీలుస్తూ జీవిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో గ్రామస్తులు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు వివరించారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

మొగుళ్లపల్లి, మే 19 : సబ్సిడీపై రైతులు అందించే జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి పీ సురేందర్‌రెడ్డి తెలిపారు. ఈ విత్తనాలను ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 190 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. వానకాలం సీజన్‌లో పచ్చిరొట్ట ఎరువుతో భూమిలో పోషక విలువలు పెరిగి భూమి సారవంతం అవుతుందని, తద్వారా ఎరువుల వాడకం తగ్గుతుందని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

మహాముత్తారం, మే 19: మండలంలోని స్తంభంపల్లి(పీకే) గ్రామంలో మానేటి శ్యామ్‌కుమార్‌కు చెందిన ఎద్దు విద్యుత్ షాక్‌తో సోమవారం మృతిచెందింది. బాధితుడి పొలం మీదుగా పందిపంపుల గ్రామానికి చెందిన దామెర సుదర్శన్, రమేశ్ వారి అవసరార్థం విద్యుత్ తీగలు వేసుకున్నారు. ఇటీవల గాలిదుమారానికి విద్యుత్ తీగ ఒకచోట తెగిపోయింది. విద్యుత్ తీగ తగలడంతో షాక్ కొట్టి ఎద్దు చనిపోయిందని బాధితుడు పేర్కొన్నాడు. అతడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఏఎస్సై మహేందర్ తెలిపారు.

విద్యుత్ అంతరాయం

భూపాలపల్లి రూరల్, మే 19: మండలంలోని పెద్దాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు భూపాలపల్లి ఏఈ విశ్వాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ విద్యుత్‌లైన్‌కు మరమ్మతులు చేయనున్నందున పెద్దాపూర్, గుర్రంపేట బాసింగ్‌పల్లి, సుబ్బక్కపల్లి, పెరకపల్లిలో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సింహగర్జన సభ సక్సెస్ చేయాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మెపా నాయకులు

భూపాలపల్లి రూరల్, మే 19: ముదిరాజ్‌ల సింహగర్జన సభను సక్సెస్ చేద్దామని మెపా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వెంకటాపూర్ (పాలంపేట)లో ఈనెల 25న నిర్వహించే సభ, ర్యాలీకి తరలి విజయవంతం చేయాలన్నారు. సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బయ్య అశోక్, కోశాధికారి పెండెం మధుసూదన్, సంయుక్త కార్యదర్శి కొత్తగట్టు కృష్ణస్వామి, కొండబోయిన రవి, మెపా రాష్ట్ర కార్యదర్శులు బుర్రి సంపత్, తాళ్ల రవి, పోలు పరమేశ్వర్, పోతిరెడ్డి సత్తన్న, భూమా భిక్షపతి, మెపా జిల్లా ప్రధాన కార్యదర్శి కొటం రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు పడమటి నరేశ్, సంయుక్త కార్యదర్శి సమ్మెట్ల కిష్టయ్య, వెంగళ ఆంజనేయులు, సొప్పరి సాంబయ్య, ఆలేటి మల్లయ్య పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

ములుగు రూరల్, మే 19: ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను అధికారులు త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సంపత్‌రావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల నుంచి 37 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అందులో భూ సమస్యలపై 10, గృహ నిర్మాణశాఖకు 9, పింఛన్ కోసం 2, ఉద్యోగం కోసం ఒకటి, ఇతర శాఖలకు చెందినవి 15 రాగా, ఆయా శాఖల అధికారులకు రెఫర్ చేసినట్లు వివరించారు. కాగా, యాసంగి సీజన్‌లో తడిసిన వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరుతూ సీపీఐ నాయకులు, రైతు సంఘం నాయకులు అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తరుగు, తేమ పేరుతో రైస్‌మిల్లుల యజమానులు క్వింటాకు 5 నుంచి 10 కేజీల వరకు కట్టింగ్ చేస్తున్నారని, రైస్‌మిల్లర్ల దోపిడీని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

పాస్‌బుక్ పోయినది

నేను, దారావత్ కిషన్ S/o మోతీరామ్, వయస్సు: 46 సం॥లు, R/o గ్రా॥ మేకలగట్టు, మం॥ రఘునాథపల్లి, జి॥ జనగామ. మా యొక్క ఎ.3-02 గుంటల వ్యవసాయ భూమి పట్టా పాస్ బుక్ నెం. T23110010170 గలది నేను తేది. 1-05-2025 రోజున మేకలగట్టు నుండి తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ రఘునాథపల్లి బ్రాంచికి పని నిమిత్తం బైక్‌పై వెళుతుండగా పోయినది. దొరికినవారు దయచేసి సంప్రదించగలరు: సెల్: 8790649467.

WANTED

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.

NT-336372

HOUSE FOR SALE

★South East H.No. 35-1-43, 190 Sq.yds. Near Gopalpur Krishnaveni Talent School. Contact Cell: 9908865582.

NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

కాటారం డీఎస్పీ బదిలీ

కొత్త డీఎస్పీగా నారాయణ నియామకం

కాటారం, మే 19 : కాటారం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి (డీఎస్పీ) గడ్డం రామ్మోహన్‌రెడ్డిని బదిలీ చేస్తూ తెలంగాణ రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనను నేరుగా డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. కాటారం డీఎస్పీగా నారాయణను నియమించారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 77 మంది డీఎస్పీల సాధారణ బదిలీల్లో భాగంగా కాటారం డీఎస్పీని బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అరటితోట దగ్ధం

చిట్యాల, మే 19 : మండలంలోని రాంచంద్రాపూర్ శివారులో సోమవారం ప్రమాదవశాత్తు అరటి తోట దగ్ధమైంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన క్యాతం వెంకటరమణ మూడు ఎకరాల్లో అరటితోట సాగు చేశాడు. పక్కన చేనులో రైతులు పంట వ్యర్థాలకు నిప్పంటించారు. మంటలు చెలరేగి వెంకటరమణకు చెందిన ఎకరం అరటితోట, డ్రిప్పు పైపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానికులు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నాలు చేశారు. స్థానిక పోలీసులు, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. చేతికందిన పంట పూర్తిగా దగ్ధమైందని బాధిత రైతు తెలిపాడు. తనకు సుమారు రూ.5లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

మంటలు అంటుకొని దగ్ధమైన అరటి తోట

చిన్న కాళేశ్వరం పనుల అడ్డగింత

కాటారం, మే 19: చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా సర్వే నంబర్ 501లో చేస్తున్న గారెపల్లి రిజర్వాయర్ పైపులైన్ పనులను ఇప్పలగూడెంకు చెందిన భూనిర్వాసిత రైతులు సోమవారం అడ్డుకున్నారు. తమకు పరిహారం చెల్లించే వరకు పనులు చేయొద్దని, భూములు కోల్పోయి కొన్నేళ్లుగా పరిహారం అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆందోళనకు దిగారు. తమ సమస్యను పరిష్కరించిన తర్వాతే పనులు చేయాలని రైతులు దుర్గం తిరుపతి, దుర్గం రాజేశం, సాంబమూర్తి, గజ్జెల రాజయ్య, దేవరాజు డిమాండ్ చేశారు. తమకు చెందిన సుమారు 21 గుంటల భూమి పైపులైన్ నిర్మాణంలో పోతోందని తమకు పరిహారం ఇచ్చిన తర్వాతే పనులు చేయాలని అధికారులు, పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

పనులు అడ్డుకుంటున్న రైతులు

గుడుంబా స్థావరాలపై దాడులు

వెంకటాపూర్, మే 19: మండలంలోని నల్లగుంట గ్రామంలో సోమవారం సాయంత్రం పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు చేశారు. ట్రైనీ ఎస్సై జగదీష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి వంద లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 5లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జక్కుల సతీష్ తెలిపారు. పోరిక రాధపై కేసు నమోదు చేసి బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

దుర్గామాత ఆశీస్సులతో సంతోషంగా జీవించాలి

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్, మే 19: దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా జీవించాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం సింగరేణి మైన్స్ రెస్క్యూ స్టేషన్ ప్రాంగణంలో సింగరేణి కార్మికులు, సింగరేణి యాజమాన్యం సహకారాలతో నిర్మించుకున్న దుర్గాదేవి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డితో కలిసి మాజీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులతో భూపాలపల్లి సింగరేణి ఏరియా అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు సాగాలని, ప్రజలందరూ సంతోషంగా జీవించాలని కాంక్షించారు. అనంతరం భూపాలపల్లి మంజూర్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ నక్షత్రాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న స్వామి వారి మాస కల్యాణ మహోత్సవంలో పాల్గొన్ని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బీఆర్ఎస్ పార్టీ భూపాలపల్లి పట్టణ అధ్యక్షుడు కటకం జనార్ధన్, మాజీ ఎంపీపీ విద్యాసాగర్‌రెడ్డి, టీబీజీకేఎస్ భూపాలపల్లి బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ బడితల సమ్మయ్య, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీశ్‌రెడ్డి, గండ్ర యువసేన నాయకులు కరాటే శ్రీను, శ్రీకాంత్ పటేల్ పాల్గొన్నారు.

కొబ్బరికాయ కొడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి


మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి వాల్యానాయక్

సహకార సంఘాలతో ఎంతో ప్రయోజనం

భూపాలపల్లి రూరల్, మే 19: పరస్పర సహకారంతో ప్రజల అభ్యున్నతికి సహకార సంఘాలు దోహదపడతాయని జిల్లా సహకార అధికారి వాల్యానాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో టీఎన్‌జీవో హౌసింగ్ సొసైటీ భూపాలపల్లి అధ్యక్షుడు బూరుగు రవి అధ్యక్షతన సహకార గృహ నిర్మాణ సంఘాల ప్రాథమిక సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఇతర దేశాల్లో సహకార వ్యవస్థ ఎంతో ఉపయోగకరంగా ఉందని, కరోనా సమయంలో చాలామందికి ఈ వ్యవస్థతో ప్రయోజనం చేకూరిందని తెలిపారు. లాగే సహకార శాఖ ద్వారా జిల్లాలోని సంఘ సభ్యులైన ఉద్యోగులందరికీ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. సహకార రిజిస్ట్రార్ నాగనారాయణ, రాజు, టీఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి ఏ.దశరథరామారావు, రాష్ట్ర కార్యదర్శి రాకూర్ జ్ఞానేశ్వర్ సింగ్, షఫీ అహ్మద్, కోశాధికారి అన్వర్‌బేగ్, ఉపాధ్యక్షులు మురళీధర్‌రెడ్డి, మోతె వేణు, ప్రవీణ్ కుమార్, సుమలత, విజయ, ఫోర్త్‌క్లాస్ ప్రెసిడెంట్ శంకర్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె జూలై 9కి వాయిదా

గణపురం, మే 19: ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె వాయిదా వేస్తున్నట్లు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ జెన్కో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరువేరు మల్లయ్య, కేటీపీపీ బ్రాంచ్ అధ్యక్షుడు ఇనుగాల కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. కార్మిక ఉద్యోగ హక్కులను హరిస్తున్న కొన్ని కార్మిక చట్టాలు రద్దు చేయాలని తలపెట్టిన సమ్మెను జూలై 9వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. కార్మికులు, ఉద్యోగులు గమనించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, కోడెపాక కిరణ్, ఎం.అనిల్ పాల్గొన్నారు.

'ఆపరేషన్ సిందూర్' తిరంగా యాత్ర

గణపురం, మే 19: ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్తాన్ ఉగ్రవాదంపై విజయం సాధించిన భారత సైన్యానికి దేశమంతా ప్రశంసలు కురిపిస్తోంది. ఇందులో భాగంగా సోమవారం ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు నడిగొట్టి రాములు ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 150 అడుగుల త్రివర్ణ పతాకంతో సాయిబాబా టెంపుల్ నుంచి గణపురం చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ సైనికుల పోరాట పటిమను కీర్తిస్తూ తిరంగా యాత్రలు చేయాలన్నారు. మాజీ జడ్పీటీసీలు మోటపోతుల శివశంకర్‌గౌడ్, ముత్యాల రాజయ్య, మాజీ వైస్ ఎంపీపీ విడిదినేని అశోక్, మాజీ ఎంపీపీ వడ్లకొండ నారాయణరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కట్కూరి శ్రీనివాస్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తిని శివశంకర్‌గౌడ్, మండల సమాఖ్య ఏపీఎం ఇమామ్, భూపాలపల్లి జిల్లా ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ చైర్మన్ చాగర్తి లక్ష్మీనారాయణ, ఎథిక్స్ కమిటీ చైర్మన్ కూతురు రమణ, జిల్లా కోశాధికారి దౌడు రమేశ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ దూలం కుమార్, రాష్ట్ర నాయకులు వైనాల వెంకన్న, మండల ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్, కోశాధికారి అజ్మత్, భాస్కర్ లక్ష్మీనారాయణ, ధనంజయ, శంకర్, జన్నయ్య, అన్వర్, కర్రు రఘుపతి, శివ, సంతోష్, సత్యనారాయణరెడ్డి, సాంబశివుడు. రమేశ్ పాల్గొన్నారు.


ర్యాలీలో ఆర్ఎంపీ, పీఎంపీలు, ఎమ్మెల్యే సత్యనారాయణరావు

తాగునీటి సంపును ప్రారంభించిన ఎమ్మెల్యే

భూపాలపల్లి రూరల్, మే 19: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వేషాలపల్లి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో నిర్మించిన మిషన్ భగీరథ తాగునీటి సంపును సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రారంభించారు. కాలనీవాసులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భాస్కర్ గడ్డ నుంచి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వరకు రోడ్డు నిర్మించాలని, స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేయాలని, డబుల్ బెడ్ రూమ్ చుట్టూ హద్దులు నిర్ణయించాలని, డబుల్ బెడ్‌రూమ్ వద్ద పోచమ్మ గుడి నిర్మించాలని, సబ్ సెంటర్ నిర్మించాలని కాలనీవాసులు ఎమ్మెల్యేను కోరారు. ఆయన స్పందించి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏఈ మానసను ఆదేశించారు. డబుల్ బెడ్‌రూమ్ కమిటీ అధ్యక్షుడు మేర సురేష్, కమిటీ నేతలు సాగర్, రమేశ్, నవీన్, సారయ్య, దుర్గం రమేశ్, రహీం ఫయాజ్, తిరుపతి, రాజు, కాంగ్రెస్ నేతలు గురజాల రవి, ఆకుల మహేందర్, నానునాయక్, సారయ్య పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

భూపాలపల్లి రూరల్, మే 19: మైన్స్ రెస్క్యూలో అన్ని పరికరాలు సిద్ధంగా ఉంచుకోవాలని, విపత్తులు సంభవించిన ప్రదేశానికి త్వరగా చేరుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం భూపాలపల్లి సింగరేణి ఏరియాలో డైరెక్టర్ వెంకటేశ్వర్లు పర్యటించారు. ముందుగా మైన్స్ రెస్క్యూ స్టేషన్‌ను సందర్శించి పలు సూచనలు చేశారు. కేటీకే ఓసీ–2, ఓసీ–3 ఉపరితల గనులను ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డితో కలిసి డైరెక్టర్ సందర్శించారు. కేటీకే ఓసీ–2, ఓసీ–3 గనుల వ్యూ పాయింట్ వద్దకు వెళ్లి పరిశీలించి ఉపరితల గనుల్లో జరుగుతున్న పని విధానాలు, స్థితిగతులను యంత్రాల పనితీరు అడిగి తెలుసుకున్నారు. ఉప్పల్ డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. ఏరియా అధికార ప్రతినిధి కే.మారుతి, ఎస్‌వోటు జీఎం కవీంద్ర, సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్ పాల్గొన్నారు.